## క్లుప్తంగా

### సెలవుపై కమిషనర్

- ఇన్‌చార్జ్‌గా ఏడీసీ నాగనరసింహారావు

**కాకినాడ:** కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ సెలవుపై వెళ్లారు. శుక్రవారం నుంచి మార్చి 8వ తేదీ వరకు సెలవు పెట్టారు. వ్యక్తిగత కారణాలు దృష్ట్యా సెలవుపై వెళ్తున్న ఆయన స్థానంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. సుమారు 13 రోజుల పాటు సెలవుపై వెళ్తున్న నేపథ్యంలో ఏడీసీని ఎఫ్ఏసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానున్నాయి.

### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**కాకినాడ/కరప:** వార్షిక మరమ్మతుల దృష్ట్యా జగన్నాథపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో, కరప మండలం నడకుదురులోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుఫాన్‌బిల్డింగ్, పోర్టుకాలనీ, జె.రామారావుపేట, చిన్నమార్కెట్, ఏసువారివీధి, పాత జగన్నాథపురం బ్రిడ్జి, మున్సబుగారి జంక్షన్, ఎంఎస్ఎన్ చార్టీస్, తూరంగి డ్రైవర్స్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నడకుదురు సబ్ స్టేషన్ నుంచి పెనుగుదురు వైపు వెళ్లే 33 కేవీ లైన్‌లో పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఈఈ, ఏఈ సానా ఈశ్వరప్రసాద్ కోరారు.

### నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**కరప:** మండలం వేళంగిలోని శ్రీనివాస నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యేక ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ వేళంగి ప్రెసిడెంట్ లయన్ బొడ్డు భాస్కరరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని గౌతమి నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని వేళంగి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### 25న నీటి సరఫరాకు అంతరాయం

**కాకినాడ:** కాకినాడ ప్రభుత్వాస్పత్రి సమీపంలో పైప్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్పొరేషన్ డీఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 30, 32, 33, 35, 36,27,38, 39, 40, 41 డివిజన్లకు సంబంధించి కుళాయి చెరువులోని రిజర్వాయర్లకు తాగు నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. అందువల్ల ఆయా డివిజన్ల ప్రజలు ముందుగా తాగు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఇందు కోసం 0884-2373131, లేదా 1800 425 0325 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

### మేజర్ డ్రైన్లలో పూడికతీత

**కాకినాడ:** మేజర్ డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టినట్టు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. గురువారం ఆయన 46వ సచివాలయ పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. ఇదే సందర్భంగా ఆయన పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు సహకరించాలన్నారు.

### ఎంఎన్‌ఓలపై కలెక్టర్‌కు నివేదిక

**కాకినాడ క్రైం:** బయాప్సీ కోసం వార్డుకు తరలించిన మహిళ కుటుంబ సభ్యుల నుంచి లంచం గుంజిన ఘటనలో నిర్వహించిన విచారణ పూర్తి అయింది. సదరు నివేదిక గురువారం కలెక్టర్‌కు చేరింది. కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహించిన విచారణలో భాగంగా ఇద్దరు సభ్యుల విచారణ కమిటీ మొత్తం ఐదుగురు ఎంఎన్‌ఓలను విచారించి నివేదిక సిద్ధం చేసింది.

### మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై దాడి

**పిఠాపురం:** కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై పిఠాపురం రామా సెంటర్లో ఒక వ్యక్తి రాళ్లతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ బస్సు రామా సెంటర్లోకి రాగానే మద్యం మత్తులో వీరంగం చేస్తున్న పిఠాపురం అగ్రహారం రెల్లి పేటకు చెందిన అల్లం శ్రీను ఒక్క సారిగా రాళ్లతో బస్సుపై దాడికి దిగాడు. దీంతో ఏమి జరుగుతోందో తెలియక బస్సు డ్రైవరుతో పాటు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో డ్రైవరు బస్సును అక్కడే నిలిపి వేసి రాళ్ల రువ్విన వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. చివరకు సీసీ ఫుటేజీ ఆధారంగా ఆవ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

### మహాశివరాత్రి ఆదాయం రూ.11.84 లక్షలు

**సామర్లకోట:** మహాశివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన కుమార భీమేశ్వరస్వామి ఆలయంలో పూజా టిక్కెట్లు, అభిషేకాలు, అన్నదానాల విరాళాల నిమిత్తం కలుపుకుని మొత్తంగా రూ.11,84,496 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజా, అభిషేక టిక్కెట్ల ద్వారా రూ.9,63,055, అన్నదానానికి విరాళాలుగా రూ.2,21,441 వచ్చాయన్నారు. త్వరలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు.

# పేద దేవుడికి పండగ

శనైశ్చరుడు సాక్షాత్తు పరమ శివుడినే వదలలేదు. ఇక మిగిలిన దేవుళ్లు ఒక లెక్కా. ఎక్కడైనా రెండే వర్గాలు ధనిక, పేద. ఆలయాలూ అంతే. కరోనా కష్టకాలం దేవుళ్లనీ వెంటాడింది. ధనిక దేవుళ్లు తట్టుకోగలిగారు. పేద దేవుళ్లు ధూప, దీప, నైవేద్యాలకు కూడా దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు మూడేళ్ల తరువాత ఆలయాలకు లక్ష్మీకళ వచ్చింది. కరోనా భయం వీడి నెమ్మదిగా దైవదర్శనాలకు భక్తజనం కదలివస్తున్నారు.

- కరోనా కష్టం నుంచి కోలుకున్న కోవెలలు
- ధనుర్, మాఘమాసాల్లో దైవ దర్శనాలకు పోటెత్తిన భక్తజనం
- లక్ష్మీకళతో నిండుగా ఉన్న హుండీలు
- అర్చకులు, సిబ్బందికి తీరిన వేతన వెతలు


వెంకట్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు (ఫైల్)

**బోట్‌క్లబ్:** నగరంలో దాదాపు 20కి పైగా పెద్ద ఆలయాలు ఉన్నాయి. మరో 30కి పైగా చిన్న ఆలయాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఆయా పర్వదినాల్లో 800 నుంచి 1800 మంది భక్తులు వచ్చి పూజలు చేయించుకుంటున్నారు. విశిష్టమైన రోజుల్లో ఆయా ఆలయాలకు రెండు నుంచి మూడు వేల మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఆలయాల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది. ధనుర్, మాఘమాసాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మూడేళ్లుగా దాదాపు మూసుకుపోయిన గర్భాలయాల తలుపులు బార్లా తెరుచుకున్నాయి. హుండీలు, దర్శన టిక్కెట్లపై ఆధారపడి ఉన్న దేవాలయాల్లో సిబ్బంది జీతాలకు వెసులుబాటు కలిగింది. స్థానిక దేవాలయంవీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానానికి ప్రతి నెల హుండీ, టిక్కెట్ల ద్వారా సుమారు రూ.35 వేలు నుంచి రూ.45 వేల వరకూ ఆదాయం వస్తుంది. భానులింగేశ్వర ఆలయంలో నెలకు అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.12 వేల నుంచి 13 వేలు వస్తుంది. హుండీ ఆదాయం సుమారు రూ.70 వేలు వస్తుంది. అలాగే వెంకట్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకం, హుండీల ద్వారా సుమారు రూ.40 వేలు వరకూ ఆదాయం సమకూరుతోంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

#### ఆదాయం బాగా పెరిగింది



కరోనా కాలంలో సిబ్బంది జీతాలు కూడా నాలుగైదు నెలలు పెండింగ్ పెట్టాల్సి వచ్చేది. ఆదాయం లేకపోవడంతో అర్చకులు, సిబ్బంది ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఆదాయం బాగా పెరిగింది. జీతాలు పోను ఆదాయం మిగలడంతో ఎఫ్‌డీలు కూడా వేస్తున్నాం.

– ఎం.మురళీ వీరభద్రరావు,
ఈఓ, భానులింగేశ్వరస్వామి దేవస్థానం


మహా శివరాత్రికి భీమేశ్వర ఆలయంలో క్యూలో నిలబడ్డ భక్తులు

### పర్యాటక శాఖ ఆర్డీగా స్వామినాయుడు


కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన పర్యాటకశాఖ ఆర్డీ స్వామినాయుడు

**కాకినాడ సిటీ:** ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్‌గా వి.స్వామినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటకానికి సంబంధించి బీచ్ ఫ్రంట్ ఫుడ్ కోర్టులు పునఃప్రారంభించడానికి హోప్ ఐలాండ్ బోటును త్వరలో పునరుద్ధరించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రీజినల్ డైరెక్టర్ స్వామినాయుడుతో పాటు డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్, డీటీఓలు పసుపులేటి పోశయ్య, పి.వెంకటచలం, ఎ.వెంకటరావు, వి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు గ్రామాల్లో క్రాస్‌బండ్ల నిర్మాణం

- సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
- ఆర్డీఓ బీవీ రమణ

**కరప:** రబీలో సాగునీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ బీవీ రమణ తెలిపారు. కరప శివారు పేపకాయలపాలెం వద్ద శహపురం డ్రైన్‌పై క్రాస్‌బండ్ (అడ్డుకట్ట) నిర్మాణాన్ని గురువారం ఆయన రెవెన్యూ, వ్యవసాయ, డ్రైన్ల శాఖాధికారులతో పరిశీలించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పెదకొత్తూరు, పేపకాయలపాలెం, యండమూరు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాల్లో క్రాస్‌బండ్‌లు నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీఓ ఏవీ రాజేష్, డ్రైన్లశాఖ ఏఈఈ కె.కీర్తి, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.


క్రాస్‌బండ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ

**సాగునీటి ఎద్దడి నివారించాలి**

**కరప:** మండల పరిధిలో సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు స్పందించి, సాగునీటి ఎద్దడిని నివారించాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. రబీపంట పొట్టదశలో ఉందని, ఇప్పుడే సాగునీరు అవసరమన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సాగునీటి సమస్యపై దృష్టిపెట్టి ఒక్క ఎకరం కూడా నష్టపోకుండా తక్షణచర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబుతో కల్సి గురువారం ఆయన మండలంలోని గురజనాపల్లి, కరప, వలసపాకల తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, పంటపొలాలను పరిశీలించి, కౌలు రైతులతో మాట్లాడి, వారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో నీటి ఎద్దడి ఉందన్నారు. ప్రధానంగా తాళ్లరేవు, కాజులూరు, కరప మండలాల్లో ఈ సమస్య ఉందన్నారు. ఆయనతో సూరంపూడి తిరుపతిరావు, దెయ్యాల చంద్రరావు, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించండి

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- నేర సమీక్షలో అధికారులకు ఆదేశం

**కాకినాడ క్రైం:** స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశించారు. స్టేషన్ సిబ్బందితో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. గురువారం కాకినాడలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష జరిగింది. పెండింగ్ అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు, గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించి కేసుల సత్వర పరిష్కారం, సక్రమ విచారణ కు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సహాయపడేందుకు పోలీస్ స్టేషన్ల రిసెప్షన్‌లో మహిళా పోలీసులను ఉంచాలని సూచించారు. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని చెప్పారు. రాత్రి గస్తీ పెంచి, డైనమిక్ బీట్లు, ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. తగిన చర్యలు తీసుకుని చోరీ కేసుల్లో సొత్తు రికవరీ పెంచాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. దర్యాప్తు పూర్తి అయిన కేసుల్లో చార్జిషీట్లు త్వరగా ఫైల్ చేసి, కోర్టులో విచారణ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతుల్లో కేసుల దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)పై మహిళా పోలీస్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేసి, ఉత్తమ ఫలితాలు సాధించిన సీఐలు, ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. సమీక్షలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, ఏఆర్ అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, ఎస్బీ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కాకినాడ ఎస్‌డీపీఓ పి.మురళీ కృష్ణారెడ్డి, పెద్దాపురం ఎస్‌డీపీఓ ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు

# వర్ధినీడికి ఎమ్మెల్యే కన్నబాబు అభినందనలు

**కాకినాడ రూరల్:** మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన పిఠాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ వర్ధినీడి సుజాత, శ్రీను దంపతులు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలసి తన నియామకంపై ధన్యవాదాలు తెలిపారు. తనను నియమించినందుకు ధన్యవాదాలను తెలియజేశారు. ఈ సందర్భంగా సుజాత దంపతులను కన్నబాబు అభినందించారు. కన్నబాబుతో పాటు జిల్లా మంత్రి, తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను కలిసి ధన్యవాదాలు తెలినట్టు సుజాత చెప్పారు.


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్న సుజాత

### చిట్స్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా భాస్కర్

**కాకినాడ లీగల్:** కాకినాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ (సబ్ రిజిస్ట్రార్) ఎం.సుధారాణిని డిప్యూటేషన్‌పై పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో చిట్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వీవీ భాస్కర్‌ను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### జిల్లా స్క్వాష్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నవీన్‌కృష్ణ

**నాగమల్లితోట జంక్షన్:** కాకినాడ జిల్లా స్క్వాష్ అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ ముత్తా నవీన్ కృష్ణ ఎన్నికైనట్లు జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.పద్మనాభం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్క్వాష్ అసోసియేషన్‌గా ఉండేదని, ఇప్పుడు కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు ముత్తా నవీన్ కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ముత్తా క్లబ్, డీఎస్ఏలో స్క్వాష్ కోర్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. మేలో రాష్ట్రస్థాయి పోటీలను జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 182 దేశాల్లో ఈ క్రీడ ఆడుతున్నారని తెలిపారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగ్గురు నామినేషన్లు

**కాకినాడ సిటీ:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికకు సంబంధించి గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణరావు నామినేషన్ ఇప్పటికే దాఖలు చేయగా గురువారం టీడీపీ తరఫున కదలి సాయిదుర్గ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అంబటి కోటేశ్వరరావు, ఇంత సంతోషం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు.

# ప్రపంచ శాంతికి రోటరీ కృషి

**బోట్‌క్లబ్:** ఇటీవల అనేక దేశాల్లో జరుగుతున్న యుద్ధాల్లో సర్వం కోల్పోయిన నిరాశ్రయులను అంతర్జాతీయ రోటరీ ఆదుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో గురువారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆహార సంక్షోభంతో ఇబ్బంది పడుతున్న సిరియా, యెమెన్ వంటి ప్రాంతాల్లో యుద్ధవాతావరణం రాకుండా కృషి చేసేలా రోటరీ సంస్థలన్నీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు వివరించారు. ఒకేషనల్ ట్రైనింగ్ ద్వారా ఇతర దేశాల్లో వ్యవసాయ ఆధునిక పద్ధతులపై అధ్యయనం చేయడంతో పాటు దేశీయంగా అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వాల సహకారం కోరుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ గవర్నర్లు ఆంజనేయమూర్తి, వరహాలు, ఎల్ సత్యనారాయణన్, ఎం.వీరభద్రారెడ్డి, డాక్టర్ పూషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ రావు

# సెమీస్ దశలో జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ పోటీలు

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు గురువారం సెమీస్ దశకు చేరుకున్నాయి. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో ఒడిశా, మహారాష్ట్ర జట్లు పోటీ పడ్డాయి. ట్రై బేకర్ కాగా పెనాల్టీ షూట్స్‌లో రెండు జట్టు చెరో మూడు గోల్స్ చేశాయి. మరో అవకాశం ఇవ్వగా మహారాష్ట్ర గోల్ చేయగా, ఒడిశా చేయలేకపోయింది. దీంతో మహారాష్ట్రను విజేతగా నిర్ణయించారు. రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్, కర్నాటక జట్లు పోటీ పడ్డాయి. మధ్యప్రదేశ్ 6–0 స్కోర్‌తో గెలిచింది. మూడో మ్యాచ్‌లో జార్ఖండ్, పంజాబ్ జట్లు తలపడ్డాయి. జార్ఖండ్ 2–0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో హర్యానా, బెంగాల్ జట్లు పోటీ పడ్డాయి. 5–0 స్కోర్‌తో హర్యానా గెలిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ శుక్రవారం హర్యానా–మహారాష్ట్ర మధ్య మొదటి సెమీఫైనల్స్, జార్ఖండ్–మధ్యప్రదేశ్ మధ్య రెండో సెమీఫైనల్స్ జరుగుతాయని తెలిపారు.


ఒడిశా- మహారాష్ట్ర జట్ల మధ్య సాగిన మ్యాచ్

# యూజర్ చార్జీలపై దృష్టి పెట్టండి


నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న నాగ నరసింహారావు

- వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు
- ఇన్‌చార్జి కమిషనర్ నాగ నరసింహారావు

**కాకినాడ:** వాణిజ్య సముదాయాల నుంచి వసూలు కావలసిన యూజర్ చార్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఈ అంశంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. గృహ సముదాయాల యూజర్ చార్జీలు కొంత మేరకు బాగానే వసూలు అవుతున్నప్పటికీ వాణిజ్య సముదాయాల నుంచి బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని నెలాఖరు లోపు బకాయిలు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులను సమన్వయం చేసుకొని బకాయిలు వసూలయ్యేలా ముందుకు వెళ్లాలని సూచించారు. సహకరించని వాణిజ్య సముదాయాల యజమానులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధం కావాలన్నారు. యూజర్ చార్జీలను నిర్ధారించడంలో కొన్నిచోట్ల వ్యత్యాసాలు ఉన్నట్టు ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సచివాలయాల పరిధిలోని హూపర్ టిప్పర్ వాహనాలు ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ సేవలందించాలా పర్యవేక్షించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# లాడ్జిలో మహారాష్ట్ర వాసి మృతి

**కాకినాడ రూరల్:** కాకినాడ ఎల్బీ నగర్‌లోని ఒక లాడ్జిలో మహారాష్ట్ర వాసి మృతి చెందాడు. సర్పవరం పోలీసులు వివరాలు ప్రకారం... మహారాష్ట్రం థానేకు చెందిన జ్ఞానేశ్వర్ రామకృష్ణ సనత్(44) బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. వాకలపూడిలోని ఎక్స్‌లాగ్ కంపెనీలో ఇంజినీర్‌గా అతడు పనిచేస్తున్నాడు. 15 రోజులు విధుల్లో 15 రోజులు స్వగ్రామంలో ఉండే సనత్ బుధవారం మధ్యాహ్నం విధులకు రాకపోవడంతో మహారాష్ట్రకు చెందిన సహచరులు ఫోన్ చేశారు. అయినప్పటికీ ఫోన్ ఎత్తకపోవడంతో లాడ్జి మేనేజర్‌కు ఫోన్ చేశారు. వారు వచ్చి తలుపులు తెరిచే సరికి మంచంపై కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా సనత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లాడ్జి మేనేజర్ సదానందం ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై సతీష్‌కుమార్ గురువారం కేసు నమోదు చేశారు. సనత్ కుటుంబ సభ్యులకు బుధవారమే సమాచారం ఇవ్వడంతో వారు కాకినాడ చేరుకోగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

# శాస్త్ర విజ్ఞాన ప్రగతితో దేశాభివృద్ధి

- ఆర్జేడీ నాగమణి

**కాకినాడ సిటీ:** కాకినాడ ఏజీఎం ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం రాత్రి ముగిసింది. పాఠశాల ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యం నూతన ఆవిష్కరణ శక్తిని వెలికి తీస్తాయన్నారు. విజ్ఞాన శాస్త్ర ప్రగతితో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. డీఈఓ కేవీఎస్ఎన్ అన్నపూర్ణ, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కాకినాడ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె డేనియల్ రాజు తదితరులు పాల్గొని ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు